ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025 | 5


ఎండ పాట్లు

బాబోయ్.. ఇవేం ఎండలు!

- ఉక్కపోత, వేడి వాతావరణం
- వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి
- వర్షాకాలంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యం
- కొందరికి అనారోగ్య పరిస్థితులు


కాకినాడ నగరంలో ఎండ తీవ్రత కారణంగా గొడుగు వేసుకు వెళుతున్న యువతులు

ఇది వర్షాకాలమా! మండు వేసవిలో ఉన్నామా! ప్రస్తుత వాతావరణం పరిస్థితి చూస్తే అందరికీ అదే అనుమానం కలుగుతోంది. వర్షాలు కురవాల్సిన సమయంలో వేసవిని తలపించే రీతిలో కాస్తున్న ఎండలు, వీస్తున్న వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పిఠాపురం/ రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి అందరూ సేదతీరారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అప్పుడప్పుడు పడిన వర్షాలు, రుతుపవనాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉండి ఎండలు తీవ్రంగా కాస్తుండడంతో ఇప్పుడు వేసవికాలం అన్నట్టుగా మారిపోయింది వాతావరణం. గత నాలుగైదు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలకే వేడిగాలులు ప్రారంభమై, సాయంత్రం వరకు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు సాహసించట్లేదు. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. బైక్‌లపై కూడా బయట తిరగలేని పరిస్థితి. టోపీలు పెట్టుకున్నా, కూలింగ్ గ్లాస్‌లు ధరించినా మాస్కులు పెట్టుకున్నా సరే ఎండదెబ్బకు హడలిపోయారు. ఉపశమనం కోసం శీతలపానీయాలు వైపు పరుగులు పెడుతున్నారు. ఈ వాతావరణంతో మరోపక్క తలపోటు, జ్వరాలు వచ్చి జనం ఇబ్బందులు పడుతున్నారు. అటు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒకటే ఉక్కపోత. ఆపై వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పిఠాపురం, కాకినాడ, తుని, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 37-39 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరంలలో కూడా ఇదే పరిస్థితి. అయితే 41-43 డిగ్రీలు ఉన్న ఫీలింగ్ ఉంటుందని వాతావరణశాఖ చెప్తోంది. రుతుపవనాల ప్రభావం అంతగా లేకపోవడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వేడిగాలులు వీస్తున్నట్టు చెప్తున్నారు. బుధవారం ఇదే పరిస్థితి ఉండగా, గురువారం నుంచి అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడం ఒక్కటే కొంత ఉపశమనంగా ఉంది.

'నీరి' తేరేనా..


గోదావరి కాల్వలోకి చెత్త డంపింగ్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కాలుష్య కాసారాలుగా మారిపోయిన గోదావరి కాలువలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఎక్కడికక్కడ కోళ్లు, రొయ్యలతోపాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక వ్యర్థాలన్నీ యథేచ్ఛగా కాలువల్లో కలిసిపోవడంతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించడానికి రంగంలోకి దిగింది. కాలువలు ఎక్కడెక్కడ ఏవిధంగా కాలుష్యం అవుతున్నాయో గుర్తించాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్రంగా అధ్యయనం చేయించేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరి)కి బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఈ సంస్థ నిపుణులు గోదావరి కాలువలపై అధ్యయనం చేయనున్నారు.

- ఉమ్మడి జిల్లాలో గోదావరి పంట కాలువల కాలుష్యంపై ప్రభుత్వం దృష్టి
- కాలువల నిండా తీవ్రంగా వ్యర్థాలు పెరగడంతో అన్నదాతల ఇబ్బందులు
- వందలాది గ్రామాల్లోని ప్రజల తాగునీటి అవసరాలకు ఈ నీళ్లే దిక్కు
- సమస్య మూలాలపై అధ్యయన బాధ్యతలు కేంద్ర ప్రభుత్వం సంస్థకు అప్పగింత
- గోదావరి కాలువల్లో ఇనిస్టిట్యూట్ నిపుణుల అధ్యయనం : 4 నెలల్లో నివేదిక
- అటు కాలువల్లో కోళ్లు, రొయ్యలు తదితర వ్యర్థాలన్నీ యథేచ్ఛగా పారబోత
- అనేక పరిశ్రమల వృథా కాలుష్య జలాలూ కాలువల్లోకే మళ్లింపు
- 'మిషన్ క్లీన్ గోదావరి' అంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి.. పనులు నిల్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ, తూర్పు డెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్ల లక్షల ఎకరాల పంటసాగుతోపాటు తాగునీటికి కూడా ఆధారం. ఈ నేపథ్యంలో వీటిని ఎక్కడికక్కడ సురక్షితంగా ఉంచితేనే ఆ నీళ్ల తాగే ప్రజల ఆరోగ్యానికి ధీమా. కానీ దీనికి విరుద్ధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. అనేకమంది ఇళ్లల్లో ఉండే చెత్తాచెదారం అంతా తెచ్చి ఈ కాలువల్లోనే పారబోస్తున్నారు. గృహనిర్మాణ వ్యర్థాలు, చికెన్, చేపలు, రొయ్యల వ్యర్థాలు, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వాడిపడేసిన వస్తువులను కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇది కాకుండా కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలున్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు భయంకరంగా కలిపేస్తున్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఇందులో అనేకరకాల హానికారక రసాయనాలు కలిసి ఉంటాయని తెలిసినా లెక్కచేయడం లేదు. ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అలాగే పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి. వీటిలో వినియోగించగా వచ్చే కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి. కానీ ఖర్చు సాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. ఈనేపథ్యంలో గత వైసీపీ సర్కారు 'మిషన్ క్లీన్ గోదావరి' పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది. సీఎం చైర్మన్‌గా వ్యవహరించే ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేస్తామని గొప్పలు చెప్పింది. తీరా అయిదేళ్లలో కాలుష్య నివారణకు పైసా ఖర్చు చేయలేదు. ఈ నేపథ్యంలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్ల విషతుల్యంగా మారినట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందట గుర్తించింది. కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు, మున్సిపాల్టీలు సర్వే చేసింది. అత్యధికంగా కోనసీమలో కోళ్ల, రొయ్యల వ్యర్థాలు, కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్ల వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు. ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం, అటు భూగర్భ జలాలు సైతం కలుషితం అయినట్టు ఆయాశాఖలు తేల్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం పైసా కూడా ఇవ్వకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించింది. కాలువల్లో ఎక్కడెక్కడ కాలుష్యం కలుస్తోంది? ఆయా జల కాలుష్యంతో ఎంతెంత హానికర రసాయనాలున్నాయి? తద్వారా వచ్చే సమస్యలేంటి? అనే దానిపై అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కొన్ని రోజుల కిందట జిల్లాలో కాలువలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం చర్చించగా, సమగ్రంగా అధ్యయనం చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(నీరి)కి అప్పగించాలని నిర్ణయించారు. త్వరలో నీరి అధ్యయనం చేసి పరిష్కారం సూచిస్తూ నాలుగు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.


అనపర్తిలో గోదావరి కాల్వ వెంబడి చెత్త

బలభద్రపురంపైనా..

బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు కలకలం రేపిన విషయం తెలిసిందే. గ్రామంలో 62 క్యాన్సర్ కేసులున్నట్టు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అధ్యయనంలో తేలింది. ఒకే తరహా కాకుండా పలు రకాల క్యాన్సర్ కేసులు ఇక్కడే రావడానికి ఏయే కాలుష్య కారకాలు కారణం అనేది అధ్యయనం చేసి తేల్చే బాధ్యతను ప్రభుత్వం 'నీరి'కి అప్పగించింది. ఇందుకు రూ.50లక్షల వరకు ఖర్చవుతుండగా, పీసీబీ తరపున ఖర్చులు భరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో నిపుణులు అధ్యయనం ప్రారంభించనున్నారు. మరోవైపు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సైతం త్వరలో ఇక్కడ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టనుంది.


జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ

టిడ్కో గృహాలను వచ్చే డిసెంబర్ నాటికి.. లబ్ధిదారులకు ఇవ్వాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ
- ఫేక్ ఇళ్ల పట్టాలపై తక్షణమే విచారణ చేయాలి: ఎమ్మెల్యేలు
- ఖరీఫ్ సాగు కు తక్షణమే సాగునీరు అందించాలి: ఎమ్మెల్యే జ్యోతుల
- కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం

కలెక్టరేట్(కాకినాడ),జూలై16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలన్నింటినీ వచ్చే డిసెంబర్‌కి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించేందుకు తగిన కార్యాచరణ చేయాలన్నారు. గత ప్రభుత్వం టిడ్కోగృహాలు నిర్మించకుండానే లబ్ధిదారుల పేరిట రూ.140కోట్లు రుణాలు తీసుకుని వాటిని డైవర్ట్ చేయడంవల్ల అవి బ్యాంకులకు ఎన్‌పీఏలుగా మారాయన్నారు. ఈ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించి ఆగిపోయిన టిడ్కో ఇళ్లను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 1,02,450 బంగారు కుటుంబాలను గుర్తించగా వచ్చే ఆగస్టు 15 నాటికి వీరిలో 80,158 కుటుంబాలను మార్గదర్శులుగా దత్తత స్వీకరించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. స్వర్ణాంధ్ర పీ4 కార్యక్రమం కింద ఈనెల 17 నుంచి ఆగస్టు 5 వరకు గ్రామ,వార్డు సభల్లో బంగారు కుటుంబాల వాలిడేషన్ నిర్వహిస్తామన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో మాస్టర్ ట్రైనీలు, సర్వేయర్ల శిక్షణా కార్యక్రమాలు, 21 నుంచి ఆగస్టు 6 వరకు బంగారు కుటుంబాల అవసరాల సర్వే నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 3,844 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత స్వీకరించారని తెలిపారు. జిల్లాలో గ్రామస్థాయినుంచి జిల్లాస్థాయి వరకు ప్రభుత్వఉద్యోగులు మార్గదర్శులుగా 10వేల కుటుంబాలను దత్తత చేపట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 47వేలమంది రైతులు 21,400 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించామన్నారు. 69వేల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేసే లక్ష్యంతో ఇప్పటివరకు 23,636మందికి కార్డులు జారీ చేశామన్నారు. దీనిలో 1914 మంది రైతులు పంట రుణాలు పొందారన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ కింద ఇప్పటివరకు 6218 కిలోవాట్ల సామర్థ్యం కల్గిన 1799 రూఫ్ టాప్ యూనిట్ల స్థాపన జరిగిందన్నారు.పీఎం కుసుమ్ పథకం కింద రైతు వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ పవర్ ద్వారా 42.43 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు 189 ఎకరాల స్థలం సేకరించామన్నారు. ఏలేరు రిజర్వాయరులో తగినంత నీటి నిల్వలు లేని కారణంగా శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి పురుషోత్తపట్నం, పుష్కర్ లిఫ్ట్‌ల ద్వారా నీటిని ఏలేరు, పీబీసీకి సరఫరా చేస్తామని వెల్లడించారు. ఆగస్టు ఒకటి వరకు ఆగకుండా వెంటనే నీటిని లిఫ్ట్‌చేస్తే రైతులు అదను దాటిపోకుండా ఖరీఫ్ నారుమళ్లు చేపడతారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూరా సూచించారు. దీంతో సత్వరం నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పీ4లో చైతన్యవంతమైన భాగస్వామ్యం కావాలన్నారు.

పంచాయతీలను విలీనం చేయాలి
పంతం నానాజీ, రూరల్ ఎమ్మెల్యే

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు గ్రామ పంచాయతీలకు 11ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంవల్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదని, దీనివల్ల నిర్వహణ కష్టమవుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఈ పంచాయతీలను కాకినాడ నగరంలోకి విలీన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

ఆగిపోయిన పనులు చేయించాలి
వనమాడి కొండబాబు, సిటీ ఎమ్మెల్యే

కాకినాడలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద చేపట్టి నిధులు లేక ఆగిపోయిన పనులను పూర్తి చేయించాలని కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే నగరంలో పారిశుధ్యం మరింత మెరుగు పర్చవచ్చునన్నారు.

వేరే స్థలం కేటాయించాలి

గత ప్రభుత్వంలో నిర్మాణానికి అనువుగా లేని ప్రాంతాల్లో లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారని, దీనివల్ల చాలామంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదని కొందరు ఎమ్మెల్యేలు సమావేశంలో మంత్రి దృష్టి తీసుకొచ్చారు. అలాంటి వారికి పోలవరం స్పాయిల్ ల్యాండ్స్‌లో స్థలాలను కేటాయించేందుకు పరిశీలించాలన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోయినా, స్థలం కేటాయించకుండా, అధికారులకు తెలియకుండా గత ప్రభుత్వం జారీ చేసిన ఫేక్ పట్టాలపై విచారణ చేయాలని కోరారు. పట్టణాల్లో ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డు సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు.

పెద్దాపురం సిల్క్స్ ఎంపికపై అభినందన

వన్‌డిస్ట్రిక్ట్ వన్‌ప్రొడక్ట్ పథకం కింద పెద్దాపురం సిల్క్ చీరలు ఎంపికైనందుకు అధికారులను, నేతన్నలను మంత్రి నారాయణ అభినందించారు. కలెక్టర్ షాన్‌మోహన్ తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలను కమిటీకి వివరించారు. అజెండా అంశాల్లో జీరో పావర్టీ, పీ4 కార్యక్రమం అమలు ప్రగతిని వివరించారు. ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, జిల్లా జేసీ రాహుల్‌మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, టీడీపీ నాయకులు కటకంశెట్టి బాబి, వీవై దాసు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణకు కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు ఘన స్వాగతం పలికారు.

యోగాంధ్ర విజేతలకు అభినందనలు

యోగాంధ్ర పోటీల్లో భాగంగా విజయవాడ, విశాఖపట్నంల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలను మంత్రి నారాయణ అభినందించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణతోపాటు కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విజేతలను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎస్ నాయకర్ జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకులు చిట్టూరి చిట్టిబాబుతో కూడిన యోగా బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర యోగా పోటీల్లో విజేతలుగా డి.దుర్గశాంత ప్రసాద్, సయ్యద్ యాసిన్ మొహిద్దీన్, ఎం.సత్తిబాబే, కె.ఆదిత్య, కేవీవీ శివసాయిరామ్, జి.లహరి దుర్గ, ఆర్ చైత్రశివ వాసుకి, జి.దివ్యాంజలి, బి.లక్ష్మీలు ఉన్నారు.

20న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

జేఎన్టీయూకే, జూలై 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యోగా హాల్లో కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, యోగాసనా భారత్, యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ ఆఫ్ ఏపీ సహకారంతో కాకినాడ యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 20న జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ చంద్రు సుధాదేవి తెలిపారు. ఈ పోటీలు 10 నుంచి 55ఏళ్ల వరకూ వివిధ కేటగిరీల్లో జరుగుతాయన్నారు. ఆరువిభాగాల్లో నిర్వహించే పోటీల్లో బాల, బాలికలు పాల్గొనవచ్చన్నారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని, అక్కడ గెలుపొందినవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు 9133433491 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌ఆర్‌బీ చెరువు కళింగల్‌కు మరమ్మతులు
ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


కళింగల్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలురూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం మల్లవరంలోని ఆర్‌ఆర్‌బీ చెరువు ప్రధాన కళింగల్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. కళింగల్ శిథిలావస్థకు చేరిందని, కానులు, గేట్లు దెబ్బతిన్నాయని ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి అత్యవసరంగా పనులు చేపట్టారు. కళింగల్‌కు మరమ్మతుల తోపాటు కానులను కాంక్రీట్‌తో నిర్మించే పనులను బుధవారం ప్రారంభించారు.

గండ్లు పూడ్చకుంటే ఎలా?


ఏలేరు వరదలకు గొల్లప్రోలు వద్ద పడిన గండి

- 211 పనుల నిర్వహణకు రూ.18.16 కోట్లు అవసరం
- పుష్కర పరిధిలో 54.03లక్షలు ఆవస్యం
- ప్రభుత్వానికి నివేదించిన జిల్లా కలెక్టర్
- ఈ పనులు చేయకుంటే ముంపు తప్పదు
- గతేడాది వరదలకు ఏలేరు, పీబీసీ కాలువలు, చెరువులకు 280కిపైగా గండ్లు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఏలేరు, సుద్దగడ్డకు సంభవించిన వరదల కారణంగా ఏలేరు, పీబీసీ, పుష్కర కాలువలు, చెరువులకు పడిన గండ్లను ఇంతవరకూ పూడ్చకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఏలేరుకు గత ఏడాది సంభవించిన భారీ వరదలకు పంటకాలువల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. గతంలో ఎన్నడూ లేని ఏలేరు రిజర్వాయర్ నుంచి 48వేల క్యూసెక్కులపైగా వరద నీటిని రిజర్వాయర్ నుంచి కాలువలకు విడుదల చేశారు. వరద నీటి ఉధృతికి ఏలేరు, పీబీసీ కాలువలకు ఎక్కడిక్కడ గండ్లు పడ్డాయి. పలుచోట్ల కాలువల గట్లు కొట్టుకుపోయాయి. అదే సమయంలో సుద్దగడ్డ వరదలు రావడంతో పరిస్థితి మరీ తీవ్రమైంది. సెప్టెంబరు నెలలో సంభవించిన వరదల కారణంగా ఏలేరు, పీబీసీ కాలువలకు, వీటి పరిధిలోని చెరువులకు 280 చోట్ల గండ్లు పడ్డాయి. ఇందులో 500 మీటర్లకు పైగా పడి అతి భారీ గండ్లు ఉన్నాయి. గండ్లపై నుంచి నీరు ప్రవహించి పంటపొలాలను ముంచెత్తింది. సుమారు 70వేల ఎకరాలల్లో వరి, పత్తి, కాయగూరలు, ఇతర వాణిజ్య పంటలు నీట మునిగి భారీ నష్టం జరిగింది. వరదల నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వయంగా పరిశీలించారు.

కొన్ని పనులకే మోక్షం

ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా ఏలేరు, పీబీసీ కాలువలు, చెరువులకు పడిన 280 గండ్లు, ఇతర పనులు నిమిత్తం నిధులు కావాలని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో ఖరీఫ్, రబీలో సాగుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తొలుత రూ.2కోట్లతో 28 పనులు చేపట్టేందుకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. వీటి పనులు పూర్తి కాగా బిల్లులు కూడా చెల్లించారు. రెండవ విడతలో రూ3.51కోట్లతో మరో 39 పనులు నిర్వహణకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు పూర్తి చేశారు. వీటికి మాత్రం ఇప్పటి వరకూ బిల్లులు చెల్లించలేదు. ఇరిగేషన్ శాఖ ద్వారా చెల్లింపులు జరపాలని కలెక్టర్, మా వద్ద నిధులు లేవు కలెక్టర్ వద్ద నిధులు ఉంటాయి వాటి నుంచి చెల్లింపులు జరపాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు చెప్పడంతో బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. తర్వాత క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులతోపాటు గండ్ల పూడ్చివేత పనుల నిమిత్తం నిధులు అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం మాత్రం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, గుర్రపుడెక్క పనులకు మాత్రమే అనుమతించి గండ్ల పూడ్చివేత పనులకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఈ పనుల నిర్వహణ ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతోపాటు ముంపు బెడద లేకుండా ఉండేందుకు ఏలేరు, పీబీసీ, సుద్దగడ్డ, పుష్కర కాలువలు, చెరువులకు పడిన గండ్లను పూడ్చేందుకు రూ.18.70 కోట్లతో 222 పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందులో ముక్కొల్లు, రాజుపాలెం పరిసర ప్రాంతాల్లోనే ఏకంగా 106 గండ్ల పూడ్చివేత, ఇతర పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇరిగేషన్ అధికారులు పంపిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించి తక్షణం పనులు చేపట్టాల్సిన అవశ్యకతను తెలియజేశారు. మరోవైపు ఏలేరు ప్రాజెక్టు, గోదావరి ఈస్ట్రన్‌డెల్టా ప్రాజెక్టు చైర్మన్లు, నీటి సంఘాల ప్రతినిధులు అమరావతి వెళ్లి ఇరిగేషన్‌శాఖా మంత్రిని కలవాలని నిర్ణయించుకున్నారు. గండ్ల పూడ్చివేత, ఇతర అత్యవసర పనులు చేపట్టకుంటే ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలేరు, పీబీసీ, పుష్కర ఆయకట్టు పరిధిలో పంటల సాగు దినదినగండంగా మారుతుంది. సుమారు 1.50లక్షల ఎకరాల్లో పంటలకు ముంపు నిత్యం ముంపు పొంచి ఉంటుందని చెబుతున్నారు.

సంద్రోదయం!



కాకినాడ సముద్ర తీరంలో ఉదయం పూట ఆకట్టుకుంటున్న సూర్యోదయం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కాకినాడ)

సూర్యాస్తమయం!



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద సూర్యాస్తమయాన శివలింగం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం)

'ఏలేరు' వెలవెల!

» ఏలేరు జలాశయంలో అంతంత మాత్రంగానే జలాలు

» ఖరీఫ్‌పై రైతుల ఆందోళన



ఏలేరు జలాశయంలో కనిష్ఠ స్థాయిలో ఉన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఏలేరు జలాశయంలో వర్షపు నీరు చేరలేదు. ఏలేరు ప్రాజెక్టులో తక్కువ జలాలు ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాలు రాకపోతే మెట్ట రైతులకు గడ్డుకాలం తప్పేదిలేదు. మెట్ట అవసరాలు తీర్చే ఏలేరు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 86.56 మీటర్లకు 24.11 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 77.31మీటర్ల స్థాయిలో కేవలం 10.52 టీఎంసీలు జలాలే ఉన్నాయి. ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం నియోజక వర్గాల పరిధిలో 64 ఎకరాల ఖరీఫ్ సాగు ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న టీఎంసీల్లో నిబంధనల ప్రకారం ఆరు టీఎంసీలు ప్రాజెక్టులో ఉంచాలి. మిగతా టీఎంసీల నుంచి విశాఖ పారిశ్రామిక, తాగు నీరు, సాగు అవసరాలకు అందించాలి. నాలుగు టీఎంసీలు జలాలను వ్యవసాయం, విశాఖకు ఎలా సర్దుబాటు చేయాలనే ఆందోళన అధికారుల్లో ఉంది. ప్రస్తుతం సాగుకు 300క్యూసెక్కుల వంతున, ఎడమ కాలువ నుంచి విశాఖకు 150క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

ఖరీఫ్‌పై అనుమానాలు

ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంతో ప్రస్తుత నీటి నిల్వలపై రాబోయే రోజుల్లో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీ విధానంలో ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీరు నిర్థారిత ఆయకట్టుకు చేరకపోవడమే రైతులకు ప్రధాన సమస్యగా మారింది. కాలువల ఆధునికీకరణకు నోచుకోక కాలువలు ఇప్పటికే అధ్వానంగా ఉన్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వను బట్టే ఆయకట్టులో సాగునీరు ఆధారపడి ఉంటుంది. అలాంటప్పుడు నీటి నిల్వలు తగ్గుదలతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

విశాఖకు నీరు తరలింపు

ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో విశాఖకు నీటిని తరలిండంపై విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టులో నీటిని మోటార్ల సహాయంతో పైపుల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని తరలించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే విశాఖకు నీరు పంపించడంపట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పనపై కసరత్తు

» గిరిజన సంక్షేమ సంచాలకులు భార్గవి

రంపచోడవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాల్లోని ఉద్యోగాల్లో ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్ వర్తింపజేసేలా జీవో నెం.3లోని ఫలాలను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి అన్నారు. రంపచోడవరం ఐటీడీఏలో బుధవారంనిర్వహించిన ఆదివాసీ వర్గాలు, మేధావుల సదస్సులో ఆమె మాట్లాడారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు కల్పశ్రీలతో కలిసి పలువురి అభిప్రాయాలను సేకరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రద్దయిన జీవో నెం.3ని పునరుద్ధరించాలంటూ జరిగిన ఉద్యమాలు, వినతుల నేపథ్యంలో ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవాలన్న అంశంలో నిర్దేశిత ప్రొఫార్మాలో అభిప్రాయాలను తీసుకుంటున్నామని ఆమె అన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోను ఈ అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి సమర్పించి జీవో నెం.3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ సరైన రాజ్యాంగసవరణ ద్వారానే గిరిజన హక్కులు, రిజర్వేషన్లు పరిరక్షిస్తామన్నారు. ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాసరావు దొర, మిడియం శ్రీనివాసరావు, కొవ్వాసి శ్రీనివాసరావు, గొర్లె చిన్ననారాయణరావు, కత్తుల ఆదిరెడ్డి, మడి నెహ్రూ, వంతు బాలకృష్ణ, లోతా రామారావు, శరంకోట అబ్బాయిరెడ్డి, కింటుకూరి లక్ష్మణరావు, గిరిజన చట్టాల సలహాదారు, పి.త్రినాధరావు, న్యాయవాదులు కె.సత్యప్రసాద్, ఎ.నవీన్‌కుమార్, ఎం.రవితేజ తమ అభిప్రాయాలను వెల్లడించారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి

ఇంజనీరింగ్ కళాశాలల్లో..
పరిశోధనలకు పెద్దపీట వేయాలి

» సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్

» జేఎన్‌టీయూకేలో యూసీఈకే ఓక్ ఉత్సవాలు ప్రారంభం



ఓక్ ఉత్సవాల్లో భాగంగా ఏడాదిపాటు చేపట్టే కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో 4నుంచి 5వేల వరకూ ఇంజనీరింగ్ కళాశాలలున్నా వాటిలో 100 కళాశాలలు కూడా చెప్పుకోదగినవి కాదని, అన్ని కళాశాలలు ఐఐటీ స్థాయికి చేరలేవు కానీ స్వయం ప్రతిపత్తితో సాంకేతిక విద్యలో నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతూ పరిశోధనలకు పెద్దపీట వేయాలని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ సూచించారు. కాకినాడ నగరంలో 1946లో ఏర్పాటైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల(యూసీఈకే) 2025, జూలై 16 నాటికి 79ఏళ్లు పూర్తి చేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఓక్ ఉత్సవాలు వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు యూసీఈకే కళాశాల ప్రతిష్టను తెలియజేయనున్నారు. ఏడాదిపాటు అనగా 2025, జూలై 16 నుంచి 2026, జూలై 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ ప్రారంభించగా గౌరవఅతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ప్రత్యేక అతిథులుగా పూర్వ విద్యార్థులు ఐఐటీ మద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం, బెంగళూరులోని ఎక్స్ఐఎంఈ పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కే భట్టా, ఇన్వెకాస్ చైర్మన్ దశరధ్ గుడే హాజరుకాగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేకే అగర్వాల్

ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ ఒకదేశం ప్రగతివైపు పయనించాలంటే సాంకేతికత వెన్నెముక అయి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఇంకా పాఠ్యప్రణాళికలోను మార్పులు తీసుకురావాలని సూచించారు. ఓక్ వేడుకల్లో భాగంగా ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికకు సంబంధించిన క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. వేద్ ప్రకాష్ మాట్లాడుతూ గత 50ఏళ్లలో 47 యూనివర్సిటీలను కొలమానంగా తీసుకోగా మూడు విశ్వవిద్యాలయాలు మాత్రమే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. రష్యా, చైనా దేశాల మాదిరిగా ప్రగతి సాధించాలంటే సైన్స్‌ను బోధించడంలో ముందడుగు వేయాలని సూచించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. 17, 18 తేదీల్లో రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్, రిజిస్ట్రార్, పలువురు డైరెక్టర్లు, మాజీ వీసీలు పాల్గొన్నారు.

కళాశాలలు ప్రతి విద్యా సంవత్సరం
అకడమిక్ ఆడిట్ నిర్వహించాలి

జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ ప్రతి విద్యా సంవత్సరం అకడమిక్ ఆడిట్ నిర్వహించాలని జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కార్యదర్శులు, కరస్పాండెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాలల్లో నైపుణ్యతా ప్రమాణాలను పెంచేందుకు చేపట్టిన వినూత్న ఇనీషియేటివ్స్‌ను వివరించారు. సిలబస్, రెగ్యులేషన్స్ నవీనీకరణ, పరిశోధనలకు పెద్దపీట వేయడం, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓపెన్ లెర్నింగ్, ఓడీఎల్ కోర్సులను మూక్స్ విద్యా విధానాలను ప్రోత్సహిస్తున్నామని, విదేశీ విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ ద్వారా మంచి బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మీట్, గ్రీట్ విత్ వీసీ కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి మాండవియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ సతీష్‌బాబు

హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుచేయాలి

కేంద్ర సహాయ మంత్రికి రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు వినతి

కాకినాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాను ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు పాల్గొన్నారు. కాకినాడలో హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయాలని మంత్రిని ఎంపీ సతీష్‌బాబు అభ్యర్థించగా ఈ ప్రతిపాదనను ఆమోదించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఈ సెంటర్ ఏర్పాటుచేస్తే జాతీయ క్రీడా పటంలో కాకినాడ స్థానం సంపాదించుకుంటుందని, యువతకు ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు.

1.62 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. బుధవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 175 గేట్లను 30 మిల్లీమీటర్లపైకి ఎత్తి 1,62,092 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత తగ్గి బుధవారం సాయంత్రానికి 15.50 అడుగులకు చేరుకుంది.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా పీజీ డిప్లొమా ఇన్ యోగా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నయ ప్రాంగణంతో పాటు కానవరంలోని శ్రీరాపర్తి యోగా సంస్థలో 50 సీట్ల చొప్పున వున్నాయన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వచ్చే నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 21న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు రూ.6వేలు, బయటివారు రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సును నన్నయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, దీనికి ఆగస్టు 25న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఫీజు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు రూ.1,500, బయటివారికి రూ.3వేలు కౌన్సెలింగ్ ప్రక్రియను విశ్వవిద్యాలయ డీవోఏ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా 73823 0 8440 నెంబరును సంప్రదించాలి.



బీర... బారెడు

ఈ బీరకాయలు బారెడు పొడవు ఉండి నిగనిగలాడిపోతున్నాయి. మీటరు బద్దంత పొడవు ఉన్న ఒక్కో బీరకాయ ధర కూడా బారెడే ఉంది. సీతానగరం గ్రామం నుంచి దిగుమతి చేసుకున్న బీరకాయలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కిలో బరువున్న ఒక్కో బీరకాయ రిటైల్ మార్కెట్లో రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది.

- అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి)

అడవుల సంరక్షణలో కీలక పాత్ర పోషించాలి

బీట్ అధికారుల స్నాతకోత్సవంలో ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, నిర్వహణలో అటవీ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవవనరుల అభివృద్ధి, వన్యప్రాణులు) డాక్టర్ శాంతిప్రియపాండే అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీ ప్రాంగణంలో 12వ బ్యాచ్ అటవీ బీట్ అధికారుల స్నాతకోత్సవం అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శాంతిప్రియ పాండే మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ అటవీ అకాడమీని గతంలో కంటే ప్రస్తుతం కొంత అభివృద్ధి చేశామని చెప్పారు. శిక్షణార్థులు జీవితంలోను, కెరీర్‌లోను మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



శిక్షణలో ప్రతిభ చూపిన ఉద్యోగికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న శాంతిప్రియపాండే

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం దివాన్‌చెరువు వద్ద ఏర్పాటుచేసిన ఈ అటవీ అకాడమీలో ఇంతవరకు 500 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుత బ్యాచ్‌లో 40 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. వీరంతా విధి నిర్వహణలో ఆదర్శంగాను, గేమ్ ఛేంజర్లుగాను నిలవాలని కోరారు. రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎన్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించే అటవీ శాఖలో పనిచేయడం భగవంతుడు ఇచ్చిన గొప్పవరంగా భావించాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలతో పాటు జ్ఞాపికలను శాంతిప్రియపాండే అందజేసి అభినందించారు. అంతకు ముందు జరిగిన పాసింగ్ పరేడ్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర పీసీసీఎఫ్ (హెచ్‌వోఎఫ్ఎఫ్) ఏకే నాయక్ శిక్షణార్థులనుద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రామారావు, అటవీ శాఖ జిల్లా అధికారి వి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ గోదాముల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌కుమార్

ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను అయినకాడికి అమ్మి రైతులు నష్టపోతున్నారని, దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థ (డబ్ల్యూడీఆర్‌ఏ)ను ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో డబ్ల్యుడీఆర్‌ఏపై బుధవారం రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, నిల్వ ఉంచుకునే పరిస్థితి లేక, చేసిన అప్పులు, పెట్టుబడులకు డబ్బులు లేక అయినకాడికి అమ్ముకుంటున్నారన్నారు. ఈ పరిస్థితిని నివారించి అధిక ధర వచ్చినపుడు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఎక్కడిక్కడ వేర్ హౌసింగ్ గోదాములను ఏర్పాటు చేసిందన్నారు. కరప మండలం నడకుదురులో ఉన్న గోదాములు ఇలా ఏర్పాటు చేసినవేనన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఈ గోదాముల్లో నామమాత్ర రుసుముతో నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇలా నిల్వ చేసిన సరుకుపై 80శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయని చెప్పారు.

అనంతరం నడకుదురులోని గోదాముల వద్దకు రైతులను తీసుకెళ్లి వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులకు భోజన సదుపాయం ఏర్పాటుచేసి శిక్షణ కిట్లు, మెటీరియల్, రూ.300 చొప్పున స్టైఫండ్ పంపిణీ చేశారు. డీసీఏవో, ఇన్‌చార్జ్ డీఎల్‌సీవో వీపీఎంఎం కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్‌వీవీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్, కోస్టల్ బ్యాంక్ విజయవాడ క్లస్టర్ హెడ్ వి.రవికుమార్, ఐసీఐసీఐ బ్యాంక్ రాజమహేంద్రవరం ఆర్ఎం ఎ.మురళీకృష్ణ, ఎన్ఈఆర్‌సీ అభిలాష్, సొసైటీ సీఈవో చందు, తమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు
ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు మూడు రోజుల జరిగిన శిక్షణ బుధవారం విజయవంతంగా ముగిసింది. సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు శిక్షణార్థులకు సరిఫికెట్లు అందజేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని 'మార్పు ద్వారా విజేతలు' కార్యక్రమ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. సభల నిర్వహణను వైకుంఠపాళీ ఆటగా నేర్పడం విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు పాలకులైతే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి భాగస్వామ్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు సుశీల, శర్మ పాల్గొన్నారు.



శిక్షణార్థికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు



వెల్లువగా వచ్చి విల్లులా మారి..

కాకినాడ నగరంలో బుధవారం సాయంత్రం కనిపించిన దృశ్యమిది.. ఆకాశంలో పక్షులు విల్లు ఆకారంలో ఎగురుతూ గుంపుగా సందడి చేశాయి. వెంటనే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మెనూ మారే!

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాల్లో మార్పులు

రాజమహేంద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకూ ఉన్న మెనూ కాకుండా కొత్త మెనూ అమలు చేయనున్నారు. అయితే ఈ మెనూలో కొన్ని వంటకాలు పిల్లలు ఇష్టపడే విధంగా లేవని చెబుతున్నారు. ఉదాహరణకు శుక్రవారం పులి హోర, గోంగూర/ కాయగూరల పచ్చడి, ఉడికించిన గుడ్డు ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నీ డ్రై వంటకాలు కావడంతో పిల్లలు తినడానికి ఇబ్బంది పడతారని, అరుగుదల నెమ్మదిస్తే కడుపు నొప్పి వంటివి వస్తాయని ఎండీఎం కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజు	ఇప్పటివరకూ	ఇకపై మెనూ
సోమవారం	కూరగాయల కూర/ ఆకుకూరపప్పు, వేపిన గుడ్డు	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు
మంగళవారం	పులిహోర/నిమ్మరైస్, గుడ్డు, పచ్చడి, రాగిజావ	గుడ్డు కూర, పప్పు, రసం, రాగిజావ
బుధవారం	కలగలుపు కూర, గుడ్డు	వెజ్ పులావ్, బంగాళా దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు
గురువారం	అన్నం/పలావు, ఆలూ కుర్మా, గుడ్డు	సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
శుక్రవారం	ఆకుకూర పప్పు, వేపిన గుడ్డు	పులిహోర, చట్నీ, గుడ్డు
శనివారం	కలగలుపు కూర, స్వీట్ పొంగల్	కలగలుపు కూర, రసం, రాగిజావ, స్వీట్ పొంగల్

గమనిక: రోజూ తెల్ల అన్నం మామూలే

వసతి గృహాల్లో పోస్టుల భర్తీకి జిల్లాలవారీగా సమీక్ష : మంత్రి డోలా



మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ఉప్పలగుప్తం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సంక్షేమ అధికారుల పోస్టులు భర్తీకి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. వైసీపీ హయాంలో సౌకర్యాల లేమితో కునారిల్లిన వసతి గృహాలను చక్కదిద్దేందుకు పక్కా ప్రణాళిక ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. బుధవారం కోనసీమ జిల్లా భీమనపల్లిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వసతి గృహాలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం, వసతి తదితర అంశాలపై అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్టు వివరించారు. విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వంలో వసతుల కల్పన జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల విషయంలో కూటమి సర్కారు కచ్చితంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో ఉన్న నిబంధనల మేరకే నిధులు ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, ఎస్సీఎస్టీలను వంచించిందని మంత్రి ఆరోపించారు. కార్యక్రమంలో భీమనపల్లి సొసైటీ ఛైర్మన్ ఆకేటి శ్రీనివాసరావు(పెద్ద), ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టిడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.

ఆగస్టు 3న జాతీయ చెస్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హైమావతి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆగస్టు 3న ఓపెన్ జాతీయ చెస్ పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల హైమావతి తెలిపారు. ఈ మేరకు టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి హైమావతి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ టోర్నమెంట్ పేరుతో లోరియల్ హై గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. విజేతలకు రూ.1,23,456 నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలకు దేశం నలుమూలల నుంచి సుమారు 400 మంది చెస్ క్రీడాకారులు వస్తారని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్, ప్రిన్సిపాల్ ఏక్తా, చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన
ఎస్ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు ఆర్థిక సాయం



ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబాలకు రూ.16.5లక్షల ఆర్థిక సాయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందజేశారు. ఎమ్మెల్యే బండారు అభిమానులు సేకరించిన ఈ మొత్తంలో ఎస్ఐ అశోక్ కుటుంబానికి రూ.12లక్షలు, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబానికి రూ.4.5లక్షలు అందించారు. ఎస్ఐ కుటుంబానికి రాజమండ్రిలో, కానిస్టేబుల్ కుటుంబానికి ఆలమూరులో ఎమ్మెల్యే బండారు చేతుల అందించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అటవీశాఖలో 700 ఉద్యోగాల నియామకానికి చర్యలు

దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన

రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే



శాంతిప్రియ పాండే

దివాన్‌చెరువు, జూలై16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీశాఖలో ఖాళీగా ఉన్న 700 ఉద్యోగాల నియామకానికి సంబంధించి చర్యలు చేపట్టామని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవ వనరులు, వన్యప్రాణులు) డాక్టర్ శాంతిప్రియ పాండే తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎస్సీ కేటగిరి, క్రీడా కోటాల వివరాలతో ఏపీ పీఎస్సీకి రాశామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో బుధవారం తనను కలసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ అకాడమీలో ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్‌వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. అటవీశాఖలో ఇంకా 400 మంది ఉద్యోగులు శిక్షణ పొందవలసి ఉందన్నారు. దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన జరిగిందని, ఆ పనులను సీపీడబ్ల్యూడీకి అప్పగించనున్నామని చెప్పారు. ఆరు నెలల్లో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.

'తల్లికి' ఆనందమేది!

● 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు తప్పుడు నివేదికలు

● ఒంటరి మహిళల బాధలు ● ఖాతాల్లో పడని డబ్బులు



నాగ సత్య గంగా భవాని

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తల్లికి వందనం పథకం పేరిట తల్లుల ఖాతాల్లో డబ్బులు వేసి ఆనందం నింపుతోంది. అయితే కొందరు తల్లులకు మాత్రం ఆ ఆనందం దక్కడంలేదు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన కటకం నాగసత్య గంగా భవానికి ఇద్దరు చిన్నారులు. ఆమెకు తల్లికి వందనం మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ ఆమె పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నివేదికలు చూపడంతో తీవ్ర ఆందోళన చెందింది. దీంతో సామర్లకోటలోని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారుల వద్ద వివరణ కోరారు. దీంతో సదరు మహిళ పేరిట 40 సర్వీసులు ఉన్నట్టు చెప్పడంతో కనీసం సొంత ఇల్లు కూడా లేని తనకు విద్యుత్ సర్వీసులు ఎలా ఉంటాయని ఆమె ప్రశ్నించింది. అధికారులు చేసిన తప్పుడు నివేదికలను తొలగించేందుకు ఒక్కొక్క సర్వీసుకు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు చెప్పారు. దీంతో ఆమె తన పేరిట ఉన్న 40 సర్వీసుల తొలగింపు చర్యల నిమిత్తం రూ.1800 చెల్లించింది. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం సమగ్ర దర్యాప్తు జరిపి తల్లికి వందనం పథకం తనకు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే తన ఇద్దరి పిల్లల చదువు అర్ధాంతరంగా ముగించాల్సి వస్తుందని గంగాభవాని వాపోయింది. కాగా ఈ విషయపై కాకినాడ జిల్లా కలెక్టర్‌కు నూతలపాటి అప్పలకొండ వినతి పత్రం అందజేశారు.

ఫ్రీ సీటు మెలిక..



తల్లికి వందనం రాలేదని వాపోతున్న మల్లెల రాఘవ, సంగాని లోవలక్ష్మి

సర్పవరం జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం వలసపాకల కృష్ణుడు గుడి వీధిలో నివాసం ఉంటున్న మల్లెల రాఘవకు కుమారుడు శ్రీహర్ష (9), సంగాని లోవలక్ష్మికి కుమారుడు శశివరుణ్(9) ఉన్నారు. ఆ మహిళల్ని భర్తలు విడిచిపెట్టి వెళ్లపోయారు. దాంతో ఒంటరిగా ఉంటూ కాయకష్టం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పిల్లలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించారు. శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో చేరాడు. రెండో తరగతి భాష్యం స్కూల్లో చేర్పించారు. ఇక్కడ ఉచిత విద్యా సౌకర్యం లేకపోయినా 'తల్లికి వందనం' వస్తుందనే భరోసాతో తమ ఇళ్ల సమీపంలోని స్కూల్లో ఇద్దరు పిల్లలను చేర్పించినట్టు తల్లులు రాఘవ, లోవలక్ష్మి తెలిపారు. తమకు ఈ పథకం కింద డబ్బులు రాకపోవడంతో అధికారులను అడుగుతున్నా ఏ సమాచారం చెప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ప్రభుత్వం తరఫున ఫ్రీ సీటు లభించడం, ఆన్‌లైన్‌లో ఇంకా ఉచితంగానే చదువుతున్నట్టు ఉండడంతో రూ.13వేలు రాలేదని అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వం ఒంటరి మహిళలకు ఇచ్చే వితంతు పింఛను కూడా అధికారులు తమకు ఇవ్వట్లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లి, భార్యకు గొడవలు...
నచ్చచెప్పలేక వ్యక్తి ఆత్మహత్య

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తరచుగా గొడవలాడుకుంటున్న కన్న తల్లి, కట్టుకున్న భార్యకు నచ్చచెప్పలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లికి చెందిన చోడిశెట్టి మణికంఠ(34)కు రెండేళ్ల క్రితం కీర్తనతో వివాహమైంది. వారికి చిన్నారి పాప ఉంది. తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మణికంఠకు తల్లి, భార్య మధ్య గత ఆర్నెళ్లుగా జరుగుతున్న గొడవలతో మనశ్శాంతి కరువయ్యింది. ఎవరికీ నచ్చచెప్పలేని దుస్థితిలో జీవితంపై విరక్తి పెంచుకున్న మణికంఠ మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేసి గడ్డి మందు తాగాడు. స్నేహితుడికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. ఆపస్మారకస్థితిలో ఉన్న మణికంఠను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కరప ఇన్‌చార్జి ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యంపై కేసు



నాగేశ్వరరావు (ఫైల్)

రంగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో బాలుడు అదృశ్యంపై బుధవారం కేసు నమోదు అయిందని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం రామవరం గ్రామానికి చెందిన కొంబర్ల నాగేశ్వరరావు (15) కుటుంబ సభ్యులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామం విశ్వజనని కోళ్ళ ఫారం నందు పనిచేసుకుంటున్నాడు. అయితే బాలుడు చిల్లరగా తిరుగుతున్నాడని అక్క తిట్టడంతో ఈనెల 14న ఉదయం 9 గంటలకు కోళ్ల ఫారం నుంచి వెళ్లిపోయాడు. అంతా వెతికినా కనిపించకపోవడంతో బావ మంగ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. బాలుడు ఆచూకీ తెలిస్తే రంగంపేట ఎస్ఐ 9440904854, అనపర్తి సీఐ 9440796538 నెంబర్లుకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 40మందికి కాకినాడ 5వ ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ఎస్‌కె షరీన్ జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, డి రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షీంచగా 40 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఇద్దరికి 3 రోజుల చొప్పున జైలు శిక్ష, అలాగే మరో 8మందికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3,00,000 జరిమానా విధించినట్టు తెలిపారు.

హైకోర్టు తీర్పుతో.. పోలీసు బందోబస్తు నడుమ
డీసీఎంఎస్ స్థలం స్వాధీనం

పాత భవనాల తొలగింపు ప్రక్రియ ప్రారంభం



అమలాపురంలో స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న చైర్మన్ చంద్రమౌళి, మేనేజర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు పోలీసు బందోబస్తుతో కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయిల విలువైన స్థలాన్ని బుధవారం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఆ స్థలంలో అద్దెకు ఉంటున్నవారు కోర్టును ఆశ్రయించారు. చివరకు అద్దెకు ఉంటున్నవారు షాపులు ఖాళీ చేసి జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి అప్పగించాలని గతేడాది ఆగస్టు 19న హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల డీసీఎంఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెచ్చెట్టి చంద్రమౌళి మార్కెటింగ్ సొసైటీ స్థలంపై ప్రధానంగా దృష్టి సారించారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం డీసీఎం ఎస్ మేనేజర్ కొండేపూడి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి స్థలం వద్దకు చేరుకున్నారు. పోలీసుల సహకారంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుని భవనాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. 44 సెంట్ల స్థలంలో ఉన్న భవనాలు, వృక్షాలు, చెత్తా చెదారం తొలగించి ఒక రూపు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్టు డీసీఎంఎస్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఛైర్మన్ చంద్రమౌళి ఆదేశాల మేరకు ఈ స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకించారు. డీసీఎంఎస్ ఉద్యోగులు, మంథ ఫణికుమార్ ఉన్నారు.

మోటారుసైకిల్ సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి




రామకృష్ణ (ఫైల్)

గండేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన శీలం రామకృష్ణ(54) బుధవారం మల్లేపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. రామకృష్ణ ఎక్స్ఎల్ మోటారు సైకిల్‌పై తన సొంతూరు బొర్రంపాలెం గ్రామం నుంచి ఫిల్టర్ మంచినీళ్ల కోసం వెళ్లి మల్లేపల్లి వచ్చి డివైడర్ దాటుతుండగా అదే మార్గంలో జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న మోటారుసైకిల్ రామకృష్ణ మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రామకృష్ణ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్ట నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శీలం రామకృష్ణకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు.

మహిళను గాయపర్చిన నలుగురిపై కేసు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటుక బొంతతో మహిళను గాయపర్చిన నలుగురు మహిళలపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ మహిళా హెచ్‌సీ.లలిత తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు శ్రీరామకాలనీకి చెందిన మాసా ఏసురత్నంతో అదే కాలనీకి చెందిన కల్లు శ్రీనమ్మ, మాసా మార్త, బీర అప్పాయమ్మ, బీర సంజన ఘర్షణపడి ఇటుకబొంతతో కొట్టి గాయపర్చారు. గాయపడిన ఏసురత్నం చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు ఏసురత్నం ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు మహిళా హెచ్‌సీ లలిత పేర్కొన్నారు.

డివైడర్ ఎక్కిన ట్రాక్టర్.. మరణించిన డ్రైవర్



హరీష్ (ఫైల్)

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన పెనుమత్స హరీష్ (32) ఈతకోట నుంచి ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాల లోడుతో శంఖవరం బయలుదేరాడు. మార్గమధ్యంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చే సరికి కళాశాల బస్సు ఒక్కసారిగా కళాశాలలోకి మళ్లించడంతో ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ రోడ్డు డివైడర్ ఎక్కడంతో ట్రాక్టర్ డ్రైవర్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు డ్రైవర్‌పై మీద నుంచి వెళ్లిపోవడంతో బలమైన గాయాలుకావడంతో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలు మేరకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

అంబాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెందిన తోట శ్రీనివాసరావు(58) ముక్కామలలో బొండాలు విక్రయిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఖాళీ బొండాలు తీస్తున్న సమయంలో వాటిలో ఉన్న ఓ రక్తపింజరం పాము కాటు వేసింది. దీంతో అతడు మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కోటసత్తెమ్మకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు పూజలు



సోము వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారిని బుధవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్ స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం అమ్మవారిచిత్రపటం అందజేశారు.

సత్యదేవుడికి ఎస్పీ పూజలు



దర్శనానంతరం కాకినాడ ఎస్పీ కుటుంబం

అన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధుమాదవ్ కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామి ప్రసాదం అందజేశారు.

రేపు 'లోవ'లో ప్రత్యేక పూజలు

తునిరూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవ క్షేత్రంలో ఈనెల 18న ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయన ఈవో తెలిపారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు పూజా ద్రవ్యములు, ఉచిత ప్రసాదం అందిస్తామని పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

తపాల శాఖ కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేంద్రనాథ్



పెద్దాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తపాల శాఖ కార్యనిర్వాహక కార్యదర్శిగా కాండ్రకోట బీపీఎం అడ్డగర్ల సురేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నంద్యాలలో జరిగిన రాష్ట్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల మహాసభల్లో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సురేంద్రనాథ్ చెప్పారు.

కళాజాత

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, వయో వృద్ధుల సంక్షేమంపై నగరంలో కళాజాత నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీఐ కళాశాలలో.. మాదకద్రవ్యాల మత్తులో చిత్తవుతున్న నేటి యువతరానికి వాటివల్ల కలిగే మార్పులు, రోగాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ సహకారం, వివిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో పేర్నాల కృష్ణ ఆధునిక వీధి నాటక బృందం ద్వారా ప్రజలకు పలు అంశాలను వివరిస్తోంది. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల వర్మ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో యువ నైపుణ్య దినోత్సవం

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. నేటి కృత్రిమ మేధను ప్రతీ ఒక్కరూ అందిపుచ్చుకుని ముందుకు సాగాలని సూచించారు

సుపరిపాలనను ఆచరణలో చూపిస్తున్నాం

మన పన్నుల ఆదాయం వడ్డీలకే సరిపోతోంది... వైసీపీ నిర్వాకంతో రూ.5,350 కోట్లు వెనక్కి: మంత్రి నారాయణ



ఫొటో బూత్ వద్ద ఉచిత సిలిండర్ పథకం లబ్ధిదారులతో మంత్రి నారాయణ, మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా, వైసీపీ ధ్వంసం చేసిన పాలనా వ్యవస్థలను గాడిలో పెట్టి సుపరిపాలన ఎలా ఉండాలో కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపిస్తోందని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మిరపకాయల వీధిలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించారు. పన్నుల రూపేణా మనకు వస్తున్న ఆదాయం వైసీపీ హయాంలో చేసిన 10లక్షల కోట్లకు పైగా అప్పులకు వడ్డీలు చెల్లించడానికే సరిపోతోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు ఉన్న విజ్ఞతతో అన్నిటినీ గాడిలో పెట్టి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. తాను గతంలో మునిసిపల్ శాఖ మంత్రిగా ఉండగా పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రూ5,350 కోట్లు తీసుకువస్తే గత వైసీపీ ప్రభుత్వం వినియోగించుకోలేకపోవడంతో ఆ నిధులు వెనక్కిపోయాయని తెలిపారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ నిధులదీ ఇదే పరిస్థితి అన్నారు. ఈ నిధులను వెనక్కి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని, త్వరలోనే వీటిని కేంద్రం మరలా విడుదల చేస్తుందని తెలిపారు.

వర్మకు రాజకీయంగా ఇబ్బందులు

పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు ప్రస్తుతం రాజకీయంగా కొన్ని ఇబ్బందులున్న మాట వాస్తవమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా మీ అడుగులో అడుగు వేసి వెనుక మేమున్నాం అంటూ కార్యకర్తలు, నాయకులు అండగా నిలుస్తున్నారని అభినందించారు. ఒకటి, రెండు రోజులు ఆలస్యమైనా వర్మకు త్వరలోనే మంచి స్థానం కల్పిస్తారని, ఆ దిశగా పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫొటో బూత్

ప్రభుత్వం అమలు చేసిన సూపర్‌సిక్స్ పథకాల లబ్ధిదారులతో ఏర్పాటుచేసిన ఫొటో బూత్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అక్కడ లబ్ధిదారులతో మంత్రి నారాయణ, మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడారు. వారితో ఫొటోలు దిగారు. మిరపకాయల వీధిలో ప్రజలు పలు సమస్యలపై వినతులు అందించగా వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



అనధికారికంగా తూరలు వేయడంతో ధ్వంసమైన పాతర్లగడ్డ-గొర్రిపూడి ప్రధాన రహదారి

రోడ్డు కట్...

చూసుకోకపోతే ఫట్!

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కరప మండలం పాతర్లగడ్డ-గొర్రిపూడి ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పాతర్లగడ్డ నుంచి గొర్రిపూడి వెళ్లే దారిలో కొంతమంది రాత్రికి రాత్రి రోడ్డును కట్ చేసి అక్రమంగా తూరలు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులకు చెప్పకుండా పెద్ద కాలువ నుంచి పంటబోదెలోకి సాగునీటిని మళ్లించేందుకు చేసిన ఈ పని వల్ల పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. తూరలు ఏర్పాటుచేసిన చోట రోడ్డు కుంగిపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతులను చెట్ల కొమ్మలతో పూడ్చిపెట్టి ఒక ఎర్రజెండాను పాతి వదిలేశారు. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధానరహదారిని ఇలా గుల్ల చేయడంతో పలు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై పడిన గోతులను తప్పించుకుంటూ వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మూడవ అదనపు జిల్లా జడ్జీ ఆనంది

'మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం'

కాకినాడ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులను గౌరవప్రదంగా పరిష్కరించుకోవచ్చని కాకినాడ మూడవ అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కార జాతీయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి జీజీహెచ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంది మాట్లాడుతూ కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాస్, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.విజయబాబు, మూడవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి చక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'కార్పొరేట్ స్థాయిలో పెన్షనర్స్ కార్యాలయం'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌జీఆర్‌ఈ అసోసియేషన్ తిరుపతి జిల్లా పుత్తూరు యూనిట్ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి పి.కృపావరం, సంఘ సభ్యురాలు రాగిణి బుధవారం కాకినాడ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. సంఘం పనితీరు, నిర్వహణ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయం కార్పొరేట్ స్థాయిలో ఉందన్నారు. సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లకు విలువైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కృపావరం, రాగిణిలను కాకినాడ జిల్లా సంఘ సభ్యులు సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ కృపావరం పుత్తూరు యూనిట్‌కు, రాష్ట్ర సంఘానికి అంకితభావంతో సేవలు అందిస్తున్నారన్నారు. పుత్తూరు యూనిట్ ఒక ఆదర్శ యూనిట్‌గా కొనసాగుతోందన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు పద్మనాభం మాట్లాడుతూ కాకినాడ జిల్లా సంఘాన్ని స్థాపించి 50 సంవత్సరాలు పైబడిందని, అక్టోబరులో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి కృపావరం మాట్లాడుతూ ఈ వేడుకల్లో తాను భాగస్వామిని అవుతానని చెప్పి తన వంతు విరాళంగా రూ.10,116 అందజేశారు. ప్రధాన కార్యదర్శి సూకరాజు, కోశాధికారి శేషగిరి, సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీం, నరసింహరావు, అర్జునరావు, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



బోట్ క్లబ్ పార్కులో మొక్కలు నాటుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి'

సర్పవరం జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు భానుమతి కోరారు. బుధవారం బోట్ క్లబ్ పార్కులో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాలకు కాలుష్యరహిత సమాజం, భూగర్భజలాల పెంపు కోసం మొక్కలు పెంపకం తప్పనిసరి అన్నారు. మొక్కల పెంపకం ఆవశ్యకతపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు డి.లక్ష్మి, మల్లీశ్వరి, అనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్వహిస్తే

ప్రభుత్వ పథకాలు రద్దు

జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు

పిఠాపురం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారికి ప్రభుత్వం ద్వారా అందే పథకాలు రద్దు చేస్తామని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు తెలిపారు. బాలల పరిరక్షణ చట్టాలు, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

పిఠాపురం ఎంపీడీవో కర్రి స్వప్న, జిల్లా బాలల సంరక్షణాధికారులు కె.శ్రీనివాస్, జాగరపు విజయ, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సర్పంచ్‌లు నల్లా రాంబాబు, నడిగట్లు చింతలరావు, పడాల ఏడుకొండలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణశ్రీ, ప్రభావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'ఉమ్మడి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

గొల్లప్రోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహాసభలు ఈ నెల 22వ తేదీన పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో జరుగుతాయని సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు బుధవారం గొల్లప్రోలు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. అదే రోజు పట్టణ పరిధిలో అరుణోదయ కళాకారులతో మహా ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. ఈ మహాసభలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క, ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కుడితి సతీష్, నాయకులు డి.నారాయణమూర్తి, డి.సంగీత, రెడ్డి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మెరుగైన సమాజం: మంత్రి సుభాష్



కాజులూరులో ప్రచారం చేస్తున్న మంత్రి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

కాజులూరు (కరప), జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో మెరుగైన సమాజం ఏర్పడుతుందని, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కోరారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంపూర్ణ సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 20, 22 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, నేతలు రాజా సూరిబాబురాజు, కాకినాడ రామారావు, అరీఫ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉన్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా బుధవారం ఆయన 30, 46 డివిజన్లలో పర్యటించారు. నాయకులు గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, అమన్‌జైన్, పిన్నమరెడ్డి బుజ్జి, దంగేటి సతీష్, అదేపల్లి గంగరాజు, వెత్సా మురళి, పాబోలు వున్నయ్య, కొరుపూడి సుబ్రహ్మణ్యం, చినగంధం సురేష్, తలారి వెంకటలక్ష్మి, కొల్లి అపరంజి, పందిరి లక్ష్మి పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి) కొరుపల్లిలో పార్టీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, ఏటుకూరి నాగమణి, దవులూరి కృష్ణకాంత్, ఉమ, తోట కృష్ణ, మార్కండేయులు, సత్తిబాబు, సూర్యప్రకాష్, రాజు పాల్గొన్నారు.

లయన్స్ ఎలైట్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ దృశ్యం

కాకినాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ ఎలైట్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని చల్లా ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. అధ్యక్షుడిగా కందాల రవీంద్రనాథ్, కార్యదర్శిగా వడ్డాది ఆదిత్య, కోశాధికారిగా నేదునూరి అనంతరామలింగేశ్వర శర్మ బాధ్యతలు చేపట్టారు. ప్రథమ ఉపాధ్యక్షుడిగా పీవీ రాఘవరావు, ద్వితీయ ఉపాధ్యక్షుడిగా ఏంజీ శ్రీరామసాగర్, సంయుక్త కార్యదర్శిగా టీవీ సత్యనారాయణ, మెంబర్‌షిప్ చైర్మన్‌గా కటకం శ్రీనివాస్, సర్వీస్ కమిటీ చైర్మన్‌గా అజ్జరపు మల్లికార్జునరావు, ఐపీపీగా మైలవరపు సత్యనారాయణ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా ముంజులూరి విశ్వేశ్వరరావు, ఎల్సీఐ ఎఫ్ కో-ఆర్డినేటర్‌గా ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ, మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్మన్‌గా మాండలీక వెంకటశాస్త్రి, క్లబ్స్ డైరెక్టర్లుగా జి.సత్యనారాయణ, చల్లా శ్రీనివాస నిరంజన్, ఎంవీ సుబ్రహ్మణ్యం, నల్లమిల్లి సత్తిరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.పాండురంగవిఠల్, బి.గోవిందరావు బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్ కుమార్, ప్రత్యేక అతిథిగా వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవ అతిథిగా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు చిట్నీడి శ్రీనివాస్, పి.ఉమామహేశ్వరరావు, లయన్స్ ఎలైట్ క్లబ్ వ్యవస్థాపకుడు ముంజులూరి విశ్వేశ్వరరావు రీజనల్ చైర్మన్ దేవత పుత్రరావు, జోన్ చైర్మన్ మైలవరపు సత్యనారాయణ విచ్చేశారు.

తల్లిదండ్రుల సమావేశం

పెద్దాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూలు భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేకావసరాల గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎ.రవళి, ఫిజియోథెరపీ డాక్టర్ బి.అపర్ణ హాజరయ్యారు. భవిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనంద్‌రావు తల్లిదండ్రులకు విద్యార్థుల హాజరు, పాఠశాల శుభ్రత, తల్లికి వందనం, సదరం సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక వివరాలు సేకరించడం, ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్ అలవెన్స్ ఇవ్వడం ప్రతి మంగళవారం జరుగుతాయన్నారు. ప్రతి నెలలో ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

'రాగిరెడ్డి' జయంతి

కార్పొరేషన్(కాకినాడ), జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ జయంతి సందర్భంగా బుధవారం నాగమల్లితోట సెంటర్లోని గోశాలలో పశువులకు దాణా పెట్టారు. దేవాలయం వీధిని ఆనుకుని వున్న దిగమర్తి వారి వీధిలో గల లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు, అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల భోజనం పెట్టి చదువుకోవడానికి సరిపడా 30 రకాల చార్టులు, నోట్ పుస్తకాలు అందించారు. వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి వస్త్ర వితరణ చేసి నిత్యావసరాలకు నగదు అందజేశారు. కల్పనా సెంటర్ దగ్గర బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాలలో పిల్లలకు భోజనాలు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి బయట భోజన వితరణ చేశారు.

సత్రం భూములకు వేలం

తొండంగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శ్రీ సంస్థానం సత్రం భూములు కౌలు వేలం బుధవారం మూడోరోజు కూడా కొనసాగింది. 53 ఎకరాల 39 సెంట్ల భూమికి వేలం నిర్వహించగా రూ.5లక్షల 34 వేలకు రైతులు భూములు సొంతం చేసుకున్నారు.

'ఆదర్శ ప్రజాప్రతినిధి 'గోళ్లమూడి'



గోళ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే ప్రజా సైన్స్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆదర్శ ప్రజాప్రతినిధి గోళ్లమూడి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు కొనియాడారు. సీపీఎం మాజీ కార్పొరేటర్ గోళ్లమూడి నాగేశ్వరరావు సంతాప సభను బుధవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షత వహించగా సీపీఎం జిల్లా కమిటీ సీనియర్ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ, నేతలు జి.బేబీరాణి, మల్లికార్జునరావు, సురేంద్ర మాట్లాడారు, కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సీనియర్ నేత కె.సత్తిరాజు, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజ్‌కుమార్, మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చినరాజప్పను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నవర పీఏసీఎస్ అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వరరావు

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవర పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఆ గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి (ప్రొఫెషనల్) తోట నాగభూషణం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను బుధవారం అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో కలిసి శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందన సత్కారం నిర్వహించారు. వెన్నా దివాణం, సత్యలింగం, అగ్గి రాముడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

కరప, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్‌కేంద్ర బృందం పర్యటించింది. బృంద సభ్యుడు నేతి వీరభద్రరావు గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, జిల్లాపరిషత్ హైస్కూల్, మహిళా జూనియర్ కళాశాల, చెత్త నుంచి సంపద తయారీకేంద్రలను సందర్శించి అక్కడి సదుపాయాలు, సమస్యలపై ఆరాదీశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎన్.రాజరాజేశ్వరి, కార్యదర్శి యు.నిర్మలాదేవి, ఎస్‌బీఎం సభ్యులు పి.శ్రీనుబాబు, డీపీఆర్సీ సభ్యుడు అచ్చిరాజు, శివరామ్ పాల్గొన్నారు.



గురజనాపల్లిలో సంపద తయారీకేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో వాసుదేవరావు

తడి, పొడి చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటింటా చెత్త సేకరణ చేసే సిబ్బందికి సహకరించాలని డీఎల్డీవో వాసుదేవరావు, డీఎల్పీవో అన్నామణి సూచించారు. మండలంలోని గురజనాపల్లి, నడకుదురు గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి డోర్ టు డోర్ వేస్ట్ కలెక్షన్, తడి పొడి చెత్తల నిర్వహణను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీకేంద్రాన్ని సందర్శించి దాని పనితీరుపై సమీక్షించారు. వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజలను చైతన్యపరిచారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, పంచాయతీల కార్యదర్శులు కె.వారిజ, సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.

ప్రముఖ నటుల మృతికి సంతాపం

తాళ్లరేవు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ప్రముఖ నటులు కోట శ్రీనివాసరావు, బి.సరోజ చిత్రపటాలకు తాళ్లరేవులోని ప్రజా సంఘం కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళలర్పించారు. కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వుంగరాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కామిశెట్టి వేణుగోపాలరావు, టేకుమూడి ఈశ్వరరావు, కడలి ప్రకాశరావు, విజయకుమార్, బాబూరావు, సత్యశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో యువ నైపుణ్య దినోత్సవం

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. నేటి కృత్రిమ మేధను ప్రతీ ఒక్కరూ అందిపుచ్చుకుని ముందుకు సాగాలని సూచించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఎవరు అవినీతిపరులో ప్రజలకు తెలుసు

ఎమ్మెల్యే శిరీషపై మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆరోపణలపై ఖండన



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి

చింతూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎవరు అవినీతిపరులో ప్రజలకు తెలుసని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చిన్నారెడ్డి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అవినీతి పరురాలని, సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్నారని, బదిలీల సిఫార్సు లేఖలు ఇచ్చి సొమ్ములు దండుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆరోపణలు చేశారు. ధనలక్ష్మి ఆరోపణలను టీడీపీ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని చిన్నారెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ధనలక్ష్మి వ్యవహరించిన తీరు, సచివాలయ ఉద్యోగిపై వేధించిన తీరు ఎవరూ మర్చిపోలేదన్నారు. జీవో నెంబరు మూడు విషయంపై ఏనాడు చట్ట సభలో ధనలక్ష్మి లేవనెత్తలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయం, జీవో నెంబరు మూడు అమలు ఆవశ్యకతపై ఎమ్మెల్యే శిరీషదేవి అసెంబ్లీలో ప్రస్తావించారని ఆయన గుర్తుచేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి నర్సింహరావు, సీనియర్ నాయకుడు ఆకోజు నూకాచాచి, ఆసీఫ్, సురేష్‌కుమార్, తమ్మయ్య, పొదిలి రామారావు, ప్రసంగి, సత్యవతి, సోడె రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషదేవిపై ఆరోపణలు సరికాదు

ఎటపాక, జూలై16(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే శిరీషదేవిపై మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి వ్యాఖ్యలు సరికావని, ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఎటపాక క్లస్టర్ ఇన్‌చార్జ్ వల్లభనేని చందు, టీడీపీ సీనియర్ నాయకుడు నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. బుధవారం నెల్లిపాక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి వైసీపీ అనుకూల మీడియాలో ఎమ్మెల్యే శిరీషపై నిరాధార ఆరోపణలు చేశారన్నారు. వైసీపీ పాలనలో ఏజెన్సీలో అన్నిపోస్టుల్లో లెక్కలు కట్టి అమ్ముకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు ఏలూరి వెంకన్న, కణితిమధు, రమేష్ పాల్గొన్నారు.

అవినీతికి వైసీపీ కేరాఫ్ అడ్రస్

మోతుగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): అవినీతికి మారుపేరుగా ఉన్న వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నేతలు వెంకటరమణ, డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఒక ప్రకటనలో విమర్శించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మికి తగదన్నారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే శిరీషదేవిపై చాలా ఆరోపణలు చేశారని, విజ్ఞులైన ప్రజలు వాటిని నమ్మలేదన్నారు. చిన్నవయసులోనే ఎమ్మెల్యే అయిన శిరీషదేవికి వస్తున్న ఖ్యాతిని చూసి ఓర్వలేక చేస్తున్న ఆరోపణలు సత్యదూరమైనమన్నారు. ప్రజలందరికీ వాస్తవాలు తెలుసని, పదేపదే అబద్ధాలు చెప్పి ప్రజలను ఎంతోకాలం మోసం చేయలేరన్నారు. ఒరకర బొడ్డగండి పంచాయతీ పరిధిలో అనంతబాబు, ధనలక్ష్మి సహాయంతో వైసీపీ నాయకులు గ్రావెల్‌రోడ్ల పేరుతో కోట్లాది రూపాయలు దోచేశారన్నారు.

'మీరు గంజాయి వ్యాపారం చేయలేదా'

కూనవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు వారి పదవులు అడ్డుపెట్టుకుని గంజాయి వ్యాపారం చేసిన విషయం వాస్తవం కాదా అని మాజీ జడ్పీటీసీ ఎడవల్లి కన్యకాపరమేశ్వరి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గురుగింజ సామెత మాదిరిగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎమ్మెల్యే శిరీషదేవిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ధనలక్ష్మి, అనంతబాబు రంపచోడవరం నియోజకవర్గాన్ని అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మార్చిన సంగతి మరిచిపోవద్దన్నారు. అనంతబాబు, ధనలక్ష్మి చరిత్ర ఇక ముగిసిందని, రాజకీయ ఉనికి కోసం వారు మీడియాలో ఇటువంటి ఆరోపణలు చేస్తూ బతికేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గడేసుల ప్రేమ్‌చంద్, సర్వేశ్వరరావు, దాసరి నాగేశ్వరరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ సొమ్ములు చెల్లించాలి

చింతూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తునికాకు సేకరణ సొమ్ములు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం నేతృత్వంలో తునికాకు సేకరణ కార్మికులు ర్యాలీ చేశారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. తునికాకు సేకరణలో కార్మికులకు చెల్లించాల్సిన ప్రభుత్వం వాటా చెల్లించలేదన్నారు. 2021నాటి బోనస్ సొమ్ములు కూడా చెల్లించలేదన్నారు. తక్షణమే కార్మికులకు చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించాలన్నారు.ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.నాయకులు సీసం సురేష్, కుంజా సీతారా మయ్య, పొడియం లక్ష్మణ్, కారం సుందరయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల పరిహారం నోటీసులు

వీఆర్‌పురం, జూలై16(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పరిహారం నోటీసులు అందించారు. వీఆర్‌పురంలో పోలవరం నిర్వాసితుల ఇళ్లకు సంబంధించిన పరిహారం నోటీసులు బుధవారం బాధితులకు పోలవరం అధికారులు అందజేశారు. 1,003ఇళ్లకు 775మందికి ఇళ్ల పరిహారం నోటీసులు అందించారు. మిగిలిన ఇళ్లకు సంబంధించిన నోటీసులు టెక్నికల్ లోపం కారణంగా ఇవ్వలేక పోయామని, వారం రోజుల్లో మిగిలిన నిర్వాసితులకు నోటీసులు అందజేస్తామని, నిర్వాసితులెవరూ ఆందోళన చెందవద్దని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆంజనేయులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ, వీఆర్వో గంగాభవాని, చింతూరు పోలవరం కార్యాలయం సిబ్బంది, టీడీపీ మండల నాయకులు బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్ధార్థ, ముత్యాల రామారావు, బొర్ర నర సింహరావు, బొర్ర సూరి పాల్గొన్నారు.

'మహిళ మృతికి కారకులను శిక్షించాలి'

రంపచోడవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో గిరిజన మహిళ కాకూరి పార్వతి నిర్లక్ష్య మరణానికి కారణమైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని, రంపచోడవరం ఆసుపత్రిని ప్రక్షాళన చేయాలని ఆదివాసం సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుందా శ్రీను ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 13రోజులు రంపచోడవరం ఆసుపత్రిలో ఉన్న గిరిజన గర్భిణీ ఆరోగ్యంపై కనీస అవగాహన లేకుండా ప్రసవానికి సిద్ధం చేసి, ఆమె ప్రాణాలు పోయాక చేతులెత్తేయడం, సదరు ఘటనను దాచిపెట్టడం వెనుక దాగి ఉన్న అంశాలను వెలుగులోకి తేవాలన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమించి ఉన్నతాధికారులపై సైతం జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కుంజా శ్రీనివాస్ పేర్కొన్నారు.

'స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలి'

రంపచోడవరం, జూలై16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల గృహాలకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తొలగించాలని, వినియోగదారులపై మోపిన విద్యుత్ భారాలను రద్దుచేయాలని అఖిలభారతరైతు కూలీసంఘం జాతీయ నాయకురాలు పి.టాన్యా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్క్స్-ఏంగిల్స్ భవనంలో స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీల విధింపునకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న జెన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ నుంచి అధిక ధరతో కొనుగోలు చేస్తూ ప్రజలను నట్టింట ముంచేస్తున్నారన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు కె.దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, కె.సుగ్గిరెడ్డి, సీహెచ్.నగేష్, కె.బాల్‌రెడ్డి, ఎస్.చిలకమ్మ, ఐ.వి.రమణ, రోలుపల్లి నూకారెడ్డి, కార్మిక సంఘాల నాయకులు సత్యారావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, జూలై16(ఆంధ్రజ్యోతి):రంపచోడవరం ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, లెక్కలు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అభ్యర్థులు పీజీలో 50శాతం ఉత్తీర్ణత పొందిన ఉండాలని, టీచింగ్‌లో అనుభవం, ఉద్యోగవిరమణ పొందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కరుణించవా... వరుణదేవా!

వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు



గండేపల్లి మండలం మల్లేపల్లిలో వర్షాలు కురవక సగం దమ్ము చేసి నిలిచిపోయిన పొలం

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వరుణదేవా కరుణించంటూ రైతులు ఆకాశం వంక దీనంగా చూస్తున్నారు. తొలకరి ప్రారంభంలో భారీ వర్షాలు కురవడంతో ఈ సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని ముందుగా నారుమళ్లు వేశారు. అయితే నారుమళ్లు నాట్లు వేసేందుకు సిద్ధమైనప్పటికీ వర్షాలు కురకవపోవడంతో పొలాల్లో నీరు లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సగం దమ్ము చేసి నీరు లేకపోవడంతో నాట్లు వేయడానికి వీలు లేక రైతులు దీనంగా చూస్తున్నారు. మండలంలో సుమారు 7500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయాల్సి ఉండగా బోరు నీరు, చెరువు ఆయకట్టు ఉన్న చోట్ల 50శాతం నాట్లు వేయడం పూర్తయిందని వ్యవసాయాధికారులు చెపుతున్నారు. ఈవారంలో వర్షాలు కురిస్తే నాట్లు వేయడానికి వీలుగా ఉంటుందని లేకుంటే దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని రైతులు చెపుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యేలు సత్యప్రభ, దివ్య



మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



మంత్రి నారాయణకు పనుల ప్రతిపాదనల పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

ప్రత్తిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్ ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆసుపత్రిగా మార్చాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణను కోరారు. బుధవారం కాకినాడ విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే సత్యప్రభ కలిసి పలు సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. 16వ నెంబరు జాతీయ రహదారిపై నియోజకవర్గంలో శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలు ఉండటం వల్ల జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల కారణంగా పెద్ద ఎత్తున ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలివస్తున్నాయని, దీని వల్ల ఇన్‌పేషెంట్లగా రోగులకు వైద్య సేవలు అందించడం కష్టసాధ్యమవుతుందన్నారు. ఈ ఆసుపత్రిని 100 పడకల స్థాయి ఆసుపత్రికి అప్‌గ్రేడ్ చేసి వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై మంత్రికి తెలిపారు. విద్యుత్ అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు, ప్రజల సమస్యలకు సమాధానం చెప్పే పరిస్థితి ఉండటం లేదన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిన పాఠశాల భవన నిర్మాణాలు వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు వాటర్ ట్యాంకులు, పైపులైన్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలో తాగునీటి, డ్రైన్లు, రహదారుల వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నా రు. ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట- జె.అన్నవరం రహదారి, శంఖవరం రౌతులపూడి రహదారి, చిన్నింపేట ఏలూరు రహదారి పనులు వెంటనే చేపట్టే విధంగా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యే కోరారు.

తుని అభివృద్ధికి సహకరించండి

తుని రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తుని పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రతిపాదనలకు సంబంధించిన పత్రాలను కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం అందజేశారు. పలు పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను మంజూరు చేయాల్సిన నిధులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తునిలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి సంబంధించి రూపొందించిన రూ.13.41 కోట్ల పనులకు పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. తుని కొండవారిపేట తూము వద్ద అండర్ పాస్ నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణ, పరిహారం పంపిణీ, ఇతర పనులు నిమిత్తం అవసరమయ్యే రూ.13.22 కోట్లకు సంబంధించి నిధులు, పరిపాలన పరమైన అనుమతులను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంవ్యాప్తంగా రూ.15 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు, పరిపాలన పరమైన అనుమతులను మంజూరు చేయాలని మంత్రి నారాయణను దివ్య కోరారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి 6.80ఎకరాల స్థలం కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు) మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పొట్టి శ్రీరాములు ట్రస్టుకు కేటాయించిన స్థలంలో 58 అడుగుల విగ్రహం నెలకొల్పి స్మృతి వనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బి.నూకబాబు, కంచర్ల శ్రీనివాస్, కంచర్ల బాబు, కొత్త నాగపండు, వి.రాధాకృష్ణ రావు, కొత్త రాము, కొత్త వీర్రాజు, కొత్త నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, ఎమ్.సాయిబాబా, నారాయణ పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పూడికతీత



పూడికలు తీయిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి

కిర్లంపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో ఏలేరు కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. కిర్లంపూడి నీటి సంఘం అధ్యక్షుడు తూము శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కాలువ ఇరువైపులా ఆక్రమణలతో నిండిపోవడమమే కాకుండా చెత్తా, చెదారం వేయడం వల్ల పూడిక భారీగా పేరుకుపోయి కింద పొలాలకు నీరు పారడంలేదు. దీంతో కాలువ పూడికతీత పనులు చేపట్టామని శ్రీరామ్మూర్తి తెలిపారు. ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు ఆదేశాల మేరకు ముక్కొల్లు డీసీ పరిధిలో కిర్లంపూడి, పెద్దనాపల్లిలో రెండు కాలువ పూడిక పనులు చేపట్టామన్నారు. రైతాంగానికి నీరందాలంటే ఈ ఏలేరు కాలువలో చెత్తా, చెదారం వేయరాదని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూము కుమార్, సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, సర్పంచ్ గుడాల శ్రీలతరాంబాబు, చదరం చంటిబాబు, కాళ్ల వెంకటేష్, తూము పెద్ద తదితరులు ఉన్నారు.

శాకంబరిగా మరిడమ్మ తల్లి



ఏలేశ్వరం మరిడమ్మ ఆలయంలో పారాయణం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మరిడమ్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. బుధవారం విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో స్థానిక లారీ యూనియన్ కార్యాలయం వద్ద అమ్మవారిని వివిధ ఆకు కూరలు, పం డ్లు, కూరగాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, 58 రకాల స్వీట్లు, పండ్లు సమర్పించారు. మహిళలు పారాయణం, గాయత్రి పఠనం చేశారు. కటకం కిరీటి, పాబోలు దేవి, ఇందిర, మంగామణి, కామాక్షి, మానస, సూర్యకుమారి, స్వ రాజ్యం, రమ్య, సుభాషిణి, అలమండ దుర్గా వెంకట ప్రసాద్,గురవయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



ప్రజా దర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న యనమల దివ్య

తొండంగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం రావికంపాడు గ్రామంలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వే కారణంగా తమ భూము లు ఆన్‌లైన్ కాలేదని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండి తరచూ ముంపునకు గురవుతున్నందన నూతన డ్రైన్ నిర్మించాలని ప్రజలు కోరారు. నూతన పింఛన్లు, రేషన్ కార్డులు మం జూరు చేయాలని తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేసారు. అనంతరం ఆమె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బా యి, అరిగెల నర్సింహమూర్తి, వెల్నాటి భరత్, సిద్దా రాంబాబు, నరహరిశెట్టి సూర్య ప్రకాష్, కొయ్యా సూరిబాబు, వడ్డి రాంబాబు పాల్గొన్నారు.

యర్రంపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



గండేపల్లి మండలం యర్రంపాలెంలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, కుంచే రామకృష్ణ, సుంకవిల్లి రాజు, ముత్యాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.అన్నవరంలో..

తుని రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి):సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి ఆధ్వర్యంలో ఎస్.అన్నవరంలో జరిగింది. ఎమ్మెల్యే దివ్య పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాలు తీసుకున్నారు. యనమల రాజేష్, సర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయండి



ఎంఈవోకు వినతి అందజేస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ కిర్లంపూడి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవోకి వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు కీర్తి మణికంఠ, కార్యదర్శి చవాకుల నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతీ పాఠశాలలో తాగునీటి సౌకర్యం ఉండాలన్నారు. చాలా పాఠశాలల్లో సరైన నీటి సదుపాయం లేదన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రౌతు నాని, నాగబాబు, నాగదుర్గ, యేసుబాబు, భానుతేజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన



సెంటర్‌లో కోడిగుడ్లు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగపార్వతి

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో జడ్.రాగంపేట 1 అంగన్‌వాడీ సెంటర్ లో నాణ్యత లేని కోడిగుడ్లు పిల్లలకు ఇస్తున్నార ని వచ్చిన ఆరోపణలపై బుధవారం అంగన్‌వా డీ సూపర్‌వైజర్ నాగపార్వతి అంగన్‌వాడీ సెం టర్‌ను పరిశీలించారు. గుడ్లను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం తూకం వస్తుందా లేదో చూశారు. సూపర్‌వైజర్ నాగపార్వతి మాట్లాడుతూ ఈ సెంటర్‌పై వచ్చిన ఆరోపణలపై పరిశీలించామని, గుడ్లు అట్ట పాడైందని గుడ్లు బాగానే ఉన్నాయన్నారు. అయితే ప్రతీ అంగన్‌వాడీ సెంటర్ ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

యర్రంపాలెం పుష్కర లిఫ్ట్ నుంచి నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న భాస్కరరావు

గండేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపాలెం పుష్కర లిఫ్ట నుంచి సుమారు 15 గ్రామాల్లో 13వేల ఎకరాల పంటలు సాగు చేసుకునేందుకు బుధవారం పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతానికి పుష్కర ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి రైతులకు నీరందించిన ఘనత జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకే దక్కుతుందన్నారు. త్వరలో తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులు చేయించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచే రాజా, పాలకుర్తి ఆదినారాయణ, పాలకుర్తి లక్ష్మీపతిరావు, డీఈ మోహనరావు, జేఈ సుందర్, సుధా, ఉండవల్లి వీరభద్రరావు, ఉండవల్లి చంద్రశేఖర్, ముత్యాల భాస్కరరావు తదితరులున్నారు.

'రైతులకు లబ్ధి చేకూరే పనులు చేయాలి'

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ద్వారా రైతులకు లబ్ధి చేకూరే పనులు చేపట్టాలని ఎంపీడీవో కె.చంద్రరావు అన్నారు. ఆయన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూరే ఇంకుడుగుంటలు, హార్టికల్చర్ ద్వారా పండ్ల పెంపకం వంటి పనులు చేయించాలన్నారు. సోషల్ ఆడిట్‌లో రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఏపీవో కృష్ణంరాజు, ఈసీ రమేష్, టీఏలు శ్రీను, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

సింగరంపాలెంలో 'పొలం పిలుస్తోంది'

గండేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపాలెంలో ఏవో రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ డి.మాలకొండయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు హాజరయ్యారు. ఏడీఏ మాలకొండయ్య ప్రస్తుత పరిస్థితుల్లో అపరాల ఆవశ్యకత వివరించి సబ్సిడీపై ఇస్తున్న కందులు, మినుములు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు వంద శాతం రాయితీతో కందులు, మినుము విత్తనాలు పంపిణీ చేశారు. డీఆర్సీ ఏవో డి.సంజయ్, ఉద్యానశాఖ అధికారి ఎ.శ్రీవల్లి, ఏఈవో పి.చంద్రమౌళి, వీహెచ్ఏ జి.రాజ్‌కుమార్, ఆయిల్‌ఫామ్ సిబ్బంది బి.ప్రసాద్, రైతులున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): 11కేవీ జగ్గంపేట ఫీడర్ నందు, 11కేవీ ఇర్రిపాక, నరేంద్రపట్నం ఫీడర్ నందు చెట్లు నరికివేత, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. పద్మనాభనగర్, పల్లపువీధి, కాకినాడ రోడ్ మెయిన్ రోడ్, కోనేటి వారి వీధి, మార్కెట్ వీధి, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాల్లో బోర్లకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మూడో రోజు సంస్థానం సత్రం భూముల వేలం

తొండంగి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శ్రీ సంస్థానం సత్రం భూములు కౌలు వేలం బుధవారం మూడోరోజు కూడా కొనసాగింది. 53 ఎకరాల 39 సెంట్ల భూమికి వేలం నిర్వహించగా రూ.5లక్షల 34 వేలకు రైతులు భూములు సొంతం చేసుకున్నారు. గతం కంటే రూ.14, 800 అధిక ఆదాయం సమకూరింది. ఈవో నున్న శ్రీరాములు, వీరభద్రరావు, వడ్డి శ్రీనివాసరావు, ఫణికుమార్, వాసు, రమణి అధికారులసమక్షంలో ఈ పాటలు జరిగాయి.

ఉద్యోగులకు అభినందన

ప్రత్తిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెం గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులుగా పని చేసి బదిలీ అయిన గణేష్, జాను, మూర్తి, ఇజ్రాయిల్, రవిను బుధవారం పెద్దిపాలెం గ్రామస్తులు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా సన్మానించి అభినందించారు. గడిచిన 5ఏళ్లుగా ఈ ఉద్యోగులు గ్రామానికి అందించిన సేవలను కొనియాడారు. సర్పంచ్ దేవర మానస రమేష్, మండల ఉపాధ్యక్షురాలు లొండా నూకరత్నం, బాబు, గ్రామపెద్దలు లొండా వెంకటేష్, రీసు సత్యనారాయణ, కుండల అప్పారావు, గైపూరి శ్రీను, పంచాయతీ కార్యదర్శి పి.నాగమణి, వీఆర్వో సత్యనారాయణ ఉన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు

రౌతులపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుమ్మరేగుల గ్రామంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలే మట్టి తవ్వి అమ్మకాలు చేస్తున్నారు. రౌతులపూడిలోని పెట్రోలు బంక్ సమీపంలో ప్రైవేట్ స్థలాన్ని కప్పేందుకు మట్టిని తోలుతున్నారు. ట్రాక్టర్‌పై తోలినందుకు రూ.500 పైగా తీసుకుంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

